www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 5 మార్చి 2025 | 5 | ఏలూరు

ఎరువుల దుకాణాల్లో అంతర్గత బృందం తనిఖీ

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక ఎరువుల దుకాణాలపై వ్యవసాయశాఖ అంతర్గత బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. శ్రీమారుతీ రామ ట్రేడర్స్ దుకాణంలో ఫారం జీరో కాలం ముగిసినందున జింక్ ఎరువుల అమ్మకం నిలుపుదలకు ఆదేశించినట్లు బృందం అధికారి మండవల్లి మండల సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకట మణి అన్నారు. దీని విలువ రూ.6 లక్షలుగా గుర్తించామన్నారు. అలాగే మస్తాన్ బాబా ఫెర్టిలైజర్స్ సుదర్షన్ ఫెర్టిలైజర్‌లో ఫారం జీరో కాలం ముగిసిన పొటాష్ నిలుపుదలకు ఆదేశించడం జరిగిందన్నారు. ఈ సరుకు విలువ రు.45 వేలుగా తనిఖీల్లో భాగంగా గుర్తించడం జరిగిందని, నిలుపుదల చేసిన సరుకు అమ్మకం జరిపితే తగు చర్యలు తప్పవని ఎరువుల దుకాణం దారులను జి.వెంకట మణి హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ శాఖాధికారి కె.విద్యాసాగర్ పాల్గొన్నారు.

పట్టభద్రుల పట్టం రాజశేఖరంకే

- తొలి ప్రాధాన్యతా ఓటుతోనే విజయం
- దాదాపు 30 గంటలు సాగిన ఓట్ల లెక్కింపు
- పిడిఎఫ్ అభ్యర్థిపై 77,461 ఓట్ల మెజార్టీతో గెలుపు
- మొత్తం ఓట్లలో తేడా, చెల్లని ఓట్లు 19,789
- ఫలించిన టిడిపి, కూటమి శ్రేణుల శ్రమ



టిడిపి నేతలతో కలిసి పేరాబత్తుల రాజశేఖరం విజయ దరహాసం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఘన విజయం సాధించారు. తొలి ప్రాధాన్యత ఓటుతోనే విజయం సొంతం చేసుకున్నారు. ప్రత్యర్థి పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుపై 77,461 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపుతో కూటమి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. జనవరి 29న ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి మూడో తేదీన నోటిఫికేషన్ విడుదల చేయడంతో నామినేషన్ల స్వీకరణ మొదలైంది. 13న విత్‌డ్రా పర్వంతో నామినేషన్ల ప్రక్రియ ముగియగా 35 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఫిబ్రవరి 27న ఎన్నికల పోలింగ్ జరగ్గా మొత్తం 3,14,984 ఓట్లకుగాను 2,18,902 ఓట్లు పోలయ్యాయి. ఉమ్మడి గోదావరి జిల్లాల పరిధిలోని బ్యాలెట్ బాక్సులను ఏలూరు సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచారు. ఈ నెల మూడో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. దాదాపు 12 గంటలపాటు ఓట్లు కట్టలు కట్టడంతో సరిపోయింది. దాదాపు 16 గంటలకు రాత్రి 11.45 గంటలకు తొలి రౌండ్ ఫలితాలు వెల్లడించారు. 28 టేబుళ్లు ఏర్పాటు చేసి టేబుల్‌కు వెయ్యి ఓట్లు చొప్పున ఎనిమిది రౌండ్లుగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగింది. ప్రతి రౌండ్ ఫలితం దాదాపు రెండు నుంచి మూడు గంటల వరకూ పట్టింది. దాదాపు 30 గంటల తర్వాత నాల్గవ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. తొలి ప్రాధాన్యతా ఓటును లెక్కిస్తూ, చెల్లని ఓట్లను పక్కన పెడుతూ కౌంటింగ్ ప్రక్రియ సాగించారు.

తొలి ప్రాధాన్యతా ఓట్లతోనే టిడిపి అభ్యర్థి గెలుపు

ఎంఎల్‌సి ఎన్నికల్లో పోస్టల్ ఓట్లతో కలిపి మొత్తం 2,18,997 ఓట్లు పోలైనట్లు అధికారులు తేల్చారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టగా 19,789 ఓట్లు చెల్లనివి తేలాయి. చెల్లుబాటు ఓట్లు 1,99,208గా తేల్చారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో గెలుపు సాధించాలంటే 99,604 ఓట్లు రావాల్సి ఉండగా టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొత్తం 1,24,702 ఓట్లు వచ్చాయి. ప్రతి రౌండ్‌లోనూ 15 వేలకు పైగా ఓట్లు సాధిస్తూ టిడిపి అభ్యర్థి పైచేయి సాధిస్తూ ముందుకెళ్లారు. మొత్తం ఎనిమిది రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ జరగ్గా ఏడో రౌండ్‌లోనే టిడిపి అభ్యర్థి గెలుపునకు సంబంధించిన మ్యాజిక్ ఫిగర్‌ను దాటేశారు. పిడిఎఫ్ అభ్యర్థికి ఈ ఎన్నికల్లో మొత్తం 47,241 ఓట్లు వచ్చాయి. మూడో స్థానంలో మాజీ ఎంపీ హర్షకుమార్ కుమారుడు జివి.సుందర్‌కు 16,183 ఓట్లు వచ్చాయి. విజయం సాధించిన టిడిపి అభ్యర్థికి జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి ధ్రువీకరణపత్రం అందించారు. ఎన్నికల్లో గెలుపొందిన పేరాబత్తుల రాజశేఖరానికి సమీప ప్రత్యర్థి దిడ్ల వీర రాఘవులు అభినందనలు తెలిపారు.

కౌంటింగ్ ఆలస్యంపై సర్వత్రా అసహనం

ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ వేగంగా జరగలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. పక్కన కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ఫలితం మూడో తేదీ రాత్రికే స్పష్టత రాగా, ఇక్కడ మాత్రం నాలుగోతేదీ మధ్యాహ్నం రెండుగంటల వరకూ సాగింది. సరైన ప్రణాళిక లేకుండా కౌంటింగ్ ప్రక్రియ చేపట్టారనే చర్చ సర్వత్రా సాగింది. సిబ్బంది మూడు షిఫ్టులుగా లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్నారు. భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణపత్రం అందుకుంటున్న రాజశేఖరం

ఓట్ల లెక్కింపులో సిబ్బంది



రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వితో టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థులు పేరాబత్తుల రాజశేఖరం, దిడ్ల వీర రాఘవులు మాటామంతి

ఓటింగ్ ప్రక్రియపై అవగాహనలో అధికారులు విఫలం

ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓట్లు వేసే అంకెలపై అధికారులు, ఏజెంట్లకు మధ్య మూడో తేదీ రాత్రి వాగ్వాదం చోటుచేసుకుంది. నిబంధనల ప్రకారం అభ్యర్థి పేరు ముందు బాక్సుల్లో ఒకటి మాత్రమే వేయాలని, రోమన్ అంకెలు వేయకూడదని, అలా వేస్తే చెల్లదని చెబుతూ వచ్చారు. కానీ కౌంటింగ్ ప్రక్రియలో మాత్రం రోమన్ అంకె ఒకటి వేసినా చెల్లుబాటు అవుతుందని తేల్చారు. అదేవిధంగా ఒకటి అంకె తప్పు గడిలో మరేమీ వేయకూడదని ప్రారంభంలో అభ్యర్థులు సైతం ఓటర్లకు తెలిపారు. ఒకటికి ముందు బార్ వేసినా ఓటు చెల్లుబాటు అవుతుందని కౌంటింగ్‌లో అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా ఒకటి వేసి ఒకటి చుట్టూ సున్నా చుట్టినా ఓట్లు చెల్లుబాటు అవుతాయని చెప్పడంపై పలువురు అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు అభ్యంతరం తెలిపారు. ఎన్నికల ముందు అభ్యర్థులతో జరిగిన సమావేశాల్లో ఓటింగ్ ప్రక్రియపై అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడం వల్లే ఇది జరిగిందని విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల నిబంధనావళి బుక్‌లో ఉన్నట్లు అధికారులు చెప్పడం విశేషం.

ఓట్లలో తేడా.. చెల్లని ఓట్లు 19,789

ఫిబ్రవరి 27వ తేదీన ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ జరిగింది. అధికారులు ఇచ్చిన లెక్కల ప్రకారం మొత్తం 2,18,902 ఓట్లు పోలవగా 69.50 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. పోస్టల్ ఓట్లు 243 కలుపుకుంటే మొత్తం 2,19,145గా ఉండాలి. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యాక అధికారులు ఇచ్చిన లెక్కలు చూస్తే మొత్తం ఓట్లు 2,18,997గా పేర్కొన్నారు. పోలింగ్ రోజు ఇచ్చిన లెక్కలకు, కౌంటింగ్ పూర్తయ్యాక ఇచ్చిన లెక్కలకు 148 ఓట్లు తగ్గాయి. దీనికి సంబంధించి అధికారులు ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు. దీంతో గతంలో ఇచ్చిన లెక్కలు, ప్రస్తుతం ఇచ్చిన లెక్కలపై అంతటా అయోమయం నెలకొంది. పట్టభద్రులు ఎన్నికల్లో సైతం చెల్లని ఓట్లు భారీగా నమోదవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఏకంగా 19,789 ఓట్లు చెల్లనివిగా తేలాయి. ఎక్కువ మంది అంకెలు వేయకుండా టిక్కులు పెట్టడం వల్ల చెల్లని ఓట్లుగా మిగిలిపోయాయి. పోస్టల్ ఓట్లు 243 పోలవగా, అందులో చెల్లని ఓట్లు 42గా ఉన్నాయి. చదువుకున్న వారుసైతం ఓటు సరిగా వేయకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ప్రధాన అభ్యర్థులు	వచ్చిన ఓట్లు
పేరాబత్తుల రాజశేఖరం	1,24,702
దిడ్ల వీరరాఘవులు	47,241
జివి.సుందర్	16,183
చెల్లని ఓట్లు	19,789

గెలుపోటములకు కారణాలపై చర్చ

ఈ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థికి గెలుపునకు ప్రధాన కారణాలు అనేకం ఉన్నాయి. ముందుగా అభ్యర్థిని ప్రకటించడం కలిసొచ్చింది. అంతేకాకుండా ఓటర్ల చేర్పుల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ నుంచి మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, గ్రామస్థాయి నాయకులు వరకూ పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. 30 మంది ఓటర్లకు ఒక టీమ్‌ను ఏర్పాటు చేయడం, సోషల్ మీడియా, టెక్నాలజీని బాగా వినియోగించుకోవడం, ఓటర్లను పోలింగ్ బూత్‌లకు రప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరచడం. ఆర్థిక బలం ఇలా అనేక అంశాలు టిడిపి అభ్యర్థి గెలుపునకు ప్రధాన కారణమయ్యాయి.

కూటమిపై నమ్మకమే గెలుపునకు కారణం
పేరాబత్తుల రాజశేఖరం

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకమే ఈ గెలుపునకు కారణం. ఎన్నికల రోజు లోకేష్ నిరంతరం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ ముందుకు నడిపించారు. అందరినీ ఏకతాటిపైకి తెచ్చి గెలుపునకు లోకేష్ ఎనలేని కృషి చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలవడం ఆనందంగా ఉంది. పట్టభద్రులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. నా గెలుపునకు కృషి చేసిన నేతలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు
దిడ్ల వీరరాఘవులు, పిడిఎఫ్ అభ్యర్థి

ఎంఎల్‌సి అభ్యర్థిగా నామినేషన్ ఘట్టం నుంచి చివరి వరకూ నాకు మద్దతు తెలిపి ఓటేసిన పట్టభద్రులకు, నా ప్రచారంలో పాల్గొని సహకరించిన శ్రేణులకు అందరికీ కృతజ్ఞతలు. భవిష్యత్తులోనూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, మహిళల, యువత పక్షాన పోరాటం కొనసాగుతోంది.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం

తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలో వాహనాలు నడిపే వాహనదారులు కచ్చితంగా రహదారి భద్రత నియమాలను పాటించాలని, లేకుంటే జరిమానాలు తప్పవని ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు. ఏలూరు నగరంలోని అశోక్‌నగర్ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం నిబంధనలకు విరుద్ధంగా నడిచే ద్విచక్ర వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపే, డ్రైవింగ్ లైసెన్స్ లేని, ట్రిపుల్ రైడింగ్ చేసే వాహనదారులపై జరిమానాలు గుప్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులపై 63 కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ తనిఖీలు ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్ రూపంలో చేస్తామని వారు స్పష్టం చేశారు. వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పి.నరేంద్రబాబు, డి.ప్రజ్ఞ, వివెల్.కళ్యాణి పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడు గంటలోనే పట్టివేత

పోలవరం పోలీసుల ఘనత

బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ పవన్ కుమార్

ప్రజాశక్తి - పోలవరం

మిస్సింగ్ కేసు నమోదు చేసిన గంటలోపే ఆ కేసుని ఛేదించి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన ఘనత పోలవరం పోలీసులకు దక్కింది. పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టిసీమ పంచాయతీ బంగారమ్మపేట గ్రామానికి చెందిన కళ్లపల్లి మేఘ సాయి అశ్వత్ పోలవరంలో ఓ ప్రయివేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో సరిగా చదవడం లేదని, చిల్లర ఖర్చులు ఎక్కువ చేస్తున్నావని తల్లి మందలించడంతో సాయి అలిగి మంగళవారం తెల్లవారుజామున ఇంటి నుండి వెళ్లిపోయాడు. ఉదయం లేచిన తల్లిదండ్రులు బాలుడి కోసం వెతికి కన్పించకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులు లోకేష్, భావన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ దర్యాప్తు ప్రారంభించారు. బాలుడి ఫొటోతో సహా సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో సమీపంలో ఉన్న అన్ని ప్రాంతాలకూ వాట్సాప్ సందేశం పంపారు. వాట్సాప్ గ్రూపుల్లో బాలుడి ఫొటో చూసిన ఒక మహిళ ఇచ్చిన సమాచారం మేరకు తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి బస్టాండు సమీపంలో ఉన్న బాలుడిని ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. కేసు నమోదు చేసిన గంటలోపే బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించడం పట్ల బాలుడి బంధువులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుత తరంలో పిల్లల మనస్తత్వాలు వివిధ రకాలుగా ఉంటున్నాయని, తల్లిదండ్రులు వారితో స్నేహభావంతో మెలిగి వారి సమస్యలు, స్నేహాలు, అలవాట్లు తదితర అంశాలపై శ్రద్ధ కనబరచాలని సూచించారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 12న ధర్నా

కరపత్రం ఆవిష్కరించిన నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ, పేదల సమస్యలపై ఈ నెల 12న విజయవాడ ధర్నాచౌక్ వద్ద జరిగే మహా ధర్నాకు వేలాదిగా తరలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అన్నే వెంకటేశ్వరరావు భవనంలో మహాధర్నా కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వంద రోజులు ఉపాధి పని పూర్తి చేసుకున్న గ్రామీణ పేదలకు అదనంగా పని దినాలు, సమ్మర్ అలవెన్స్, పేస్లిప్‌లు, పెండింగ్ వేతనాలు, ఉపాధి మేట్లకు రూ.5 పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వలస కార్మికులకు ఉచితంగా రవాణా సౌకర్యం, బియ్యం, గ్యాస్ సిలిండర్ అందించాలని కోరారు. ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షల నగదు, రెండెకరాల భూమి ఇవ్వాలన్నారు. దీంతోపాటు ప్రతి దళిత కాలనీకి రెండెకరాల శ్మశాన స్థలం కేటాయించాలని, జిఒ నెంబర్ 1235 ను అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు ప్రతి గ్రామం నుండి పేదలు పెద్ద ఎత్తున కదిలి రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణీలో కోత విధించారని దుయ్యబట్టారు. చివరకు చనిపోతే పాతి పెట్టడానికి ఆరడుగుల నేల కూడా లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డిమాండ్ల సాధనకు ఈ నెల 12న విజయవాడలో జరిగే మహాధర్నాకు ప్రతి గ్రామం నుండి పేదలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, జిల్లా ఉపాధ్యక్షులు తామా ముత్యాలమ్మ, వై.నాగేంద్రరావు, ఎస్.మహంకాళిరావు, జిల్లా సహాయ కార్యదర్శి మడకం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక అశోక్‌నగర్‌లోని డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి కెవి.రమణ, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కాకర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, తక్షణం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానికి ఐఎఫ్‌టియు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, నాయకులు మీసాల రమణ, మంచెల రాజు, లింగమల్లి శ్రీనివాసరావు తదితరులు నాయకత్వం వహించారు.

ఆర్‌జియుకెటిలో పెన్సిల్ ఆర్ట్ పోటీలు

విద్యార్థులు వేసిన ఆర్ట్స్ పరిశీలిస్తున్న బాలాజీ

నూజివీడు టౌన్ : నూజివీడులోని రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయంలో ఈ సంవత్సరం నిర్వహించనున్న వార్షిక సాంస్కృతిక మహోత్సవం సిగ్నస్ 25లో భాగంగా సోమవారం పలు ప్రత్యేకమైన కళాపోటీలను నిర్వహించారు. విద్యార్థుల సృజనాత్మకతను మెరుగుపరిచే ఉద్దేశంతో 'స్కల్ప్టెడ్ స్టోరీస్'(క్లే ఆర్ట్), 'కాన్వాస్ ఆఫ్ హెరిటేజ్'(పెన్సిల్ ఆర్ట్) పోటీలను ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ప్రొ. అమరేంద్ర కుమార్, ఆర్‌జియుకెటి శ్రీకాకుళం డైరెక్టర్ కెవిజిడి.బాలాజీ ప్రారంభించారు. విద్యార్థులలోని కళాపోషణని బయటకి తీస్తూ, మన సంస్కృతిని తెలియజేయడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యమని వారు చెప్పారు. స్కల్ప్టెడ్ స్టోరీస్ పోటీలో విద్యార్థులు రూపొందించిన ప్రతీ ప్రతిమ వెనుక ఒక కథను చెప్పేలా వారి కళాత్మకతను మట్టితో మలిచారు. కాన్వాస్ ఆఫ్ హెరిటేజ్ పోటీ ద్వారా విద్యార్థులు మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా అద్భుతమైన చిత్రాలను చిత్రీకరించారు. ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో నూజివీడు ఎఒ డాక్టర్ లక్ష్మణ రావు, శ్రీకాకుళం ఎఒ సతీష్, సిగ్నస్ కన్వీనర్ డాక్టర్ జె.సీతాపతి, ఈవెంట్స్ కో-ఆర్డినేటర్లు రఘు, రమాదేవి పాల్గొన్నారు.

నిర్మించారు.. ప్రారంభోత్సవం మరిచారు..!

హెల్త్ సెంటర్‌ను వినియోగంలోకి తేవాలని స్థానికుల వేడుకోలు

ప్రారంభం కాని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అన్నీ ఉన్నా అల్లుడి నోటిలో శని అన్న సామెత మాదిరిగా నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నప్పటికీ... ప్రారంభానికి నోచుకోని భవనాలు మండలంలో నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే నూజివీడు పట్టణంలోని డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలనీలో రూ.80 లక్షలతో 18.08.2022వ తేదీన నాటి ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యుపిహెచ్‌సి) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేపట్టారు. నిర్మాణ పనులు పూర్తిచేసుకుని అన్ని రంగులు, హంగులతో ప్రారంభానికి ఎప్పుడో సిద్ధమైంది. నేటికీ హెల్త్ సెంటర్ ప్రారంభం కాకపోవడంతో అసాంఘిక శక్తులకు నిలయంగా మారింది. హెల్త్ సెంటర్ వెనుక భాగాన కిటికీ అద్దాలు కొందరు దుండగులు బద్దలు కొట్టారు. రక్షణగా ప్రహరీ గోడ లేకపోవడం, నిర్వహణ లోపం కారణంగా పిచ్చి మొక్కలు పెరిగి, తాగుబోతులు, గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి హెల్త్ సెంటర్‌కు ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేసి, త్వరితగతిన ప్రారంభించడం ద్వారా ఎంఆర్ అప్పారావు కాలనీలో నివాసం ఉన్నటువంటి సుమారు 8 వేల మంది సామాన్య ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కాలనీవాసులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు సరికావు

యుటిఎఫ్ జిల్లా కమిటీ ఖండన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉత్తరాంధ్ర టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు యుటిఎఫ్‌కు వైసిపి ముసుగేస్తూ చేసిన వ్యాఖ్యలను యుటిఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా ఆలీ, రవికుమార్ రుద్రాక్షి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భవిష్యత్తులో మాట్లాడేటప్పుడు తన వ్యాఖ్యలను సరిచేసుకుని మాట్లాడాలని కోరారు. యుటిఎఫ్‌కు వైసిపి ముసుగేయడం సరికాదని, వాస్తవానికి ఎపిటిఎఫ్, పిఆర్‌టియు అభ్యర్థులకు కూటమి ముసుగు వేయడం ద్వారా అధికార పక్షమే ఉపాధ్యాయ ఉద్యమంలో చీలికలు తెచ్చిందని వారు విమర్శించారు. కూటమి బహిరంగంగా మద్దతు పలికిన అభ్యర్థి ఓటమి, వారు విద్యారంగంలో అనుసరిస్తున్న విధానాలకు చెంపపెట్టు అని ఇప్పటికైనా గ్రహించాలని కోరారు. ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ స్వతంత్రంగా పోటీ చేసిందని, దానికి యుటిఎఫ్, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు, ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయని వారు గుర్తు చేశారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఏ రాజకీయ పక్షమూ వహించకుండా శాసనమండలిలో స్వతంత్రంగా వ్యవహరిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలతోబాటు ప్రజల సమస్యలపై కూడా గళం ఎత్తుతున్నారని, ఈ ప్రభుత్వంలోనే కాదు గత ప్రభుత్వకాలంలోనూ అదే వైఖరి వారు అవలంభించారని పేర్కొన్నారు. రెండేళ్ల కిందట గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ మద్దతు తీసుకుని దాని రెండో ఓటుతో తెలుగుదేశం అభ్యర్థులు గెలిచిన సంగతి అచ్చెన్నాయుడు గుర్తు చేసుకోవాలని కోరారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అనుసరించిన విద్యా వినాశకర విధానాలనే ఈ ప్రభుత్వం కొనసాగిస్తూ మరింత ప్రమాదకరంగా అమలు చేస్తుందని, వాటిని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునే దిశగా తమ భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని వారు తెలిపారు.

ఉత్తమ లైన్‌మెన్‌గా బాలకృష్ణ



బాలకృష్ణను సత్కరిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఇ సాల్మన్ రాజు

ప్రజాశక్తి - భీమడోలు

ట్రాన్స్ కో భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో భీమడోలు కేంద్రంగా పనిచేసే లైన్‌మెన్ పంచకర్ల బాలకృష్ణ ఉత్తమ లైన్‌మెన్‌గా ఎంపికయ్యారు. విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను ప్రతి సంవత్సరం మార్చి 4వ తేదీన నిర్వహించే జాతీయ లైన్‌మెన్ దివస్ పురస్కరించుకొని బాలకృష్ణను సబ్ డివిజన్ స్థాయిలో ఉత్తమ లైన్‌మెన్‌గా ఎంపిక చేసి మంగళవారం సత్కరించినట్లు ట్రాన్స్ కో భీమడోలు ఎడిఇ గోపాలకృష్ణ తెలిపారు. అంతకుముందు పంచకర్ల బాలకృష్ణను ఏలూరులో ఎస్ఇ ఇంజనీర్ సాల్మన్ రాజు పాటు పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్కరించారన్నారు. భీమడోలులో నిర్వహించిన కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది పంచకర్ల బాలకృష్ణను తగు రీతిలో సత్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో భీమడోలు సహాయ ఇంజనీర్ వివి.శివాజీ పాల్గొన్నారు.

'అంటువ్యాధుల నివారణలో ఆశాలే కీలకం'



మాట్లాడుతున్న మలేరియా అధికారి ప్రసాద్

దెందులూరు : అంటువ్యాధులు అరి కట్టుటలో ఆరోగ్య, ఆశా కార్యకర్తల భాగస్వామ్యం చాలా కీలకమని, అనేక జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాల సేవలు అభినందనీయమని జిల్లా మలేరియా అధికారి పిఎస్.ప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏలూరు పట్టణ ఆరోగ్య కేంద్రాలైన గజ్జల వారి చెరువు, కొత్తపేట ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కాలాల్లో జ్వరాల ఉంటాయని, ముఖ్యంగా డెంగీ జ్వరాల ప్రబలడానికి ఎక్కువ రోజులు మంచినీటి నిలువ ప్రాంతాలు క్లీన్ చేసుకోకపోవడమే కారణమన్నారు. డెంగీ దోమ మంచినీటి నిల్వ ప్రాంతాలలో గుడ్లు పెడుతుందని, కావున ఇంటి బయట, ఇంటి లోపల ఉన్న నీటి నిల్వ ప్రాంతాలైన, డ్రమ్ములు, తొట్టెలు, పూల కుండీలు, రుబ్బురోలు, ఎయిర్ కూలర్స్, పల్లపు నీటి నిల్వ ప్రాంతాలు వారానికి ఒకసారి ఫ్రైడే ఆచరించాలని చెప్పారు. ముఖ్యంగా దోమలు నిర్మూలించాలంటే దోమ లార్వాలను ఎలిమినేషన్ చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ ప్రజలు వేసవికాలంలో అప్రమత్తంగా ఉండాలని, అశ్రద్ధ వహిస్తే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వేసవిలో అధిక వేడి వల్ల శరీరంలో ఉన్న నీరు చెమట రూపంలో బయటకు పోవడం వల్ల డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. వడదెబ్బ వల్ల జ్వరం, వాంతులు, స్పృహ తప్పి పడిపోవడం, కళ్లు తిరగడం, కొన్నిసార్లు ప్రాణాలు పోయే అవకాశం ఉందన్నారు. కావున ప్రజలు అధిక వేడిలో పనిచేయరాదని, ఎక్కువ ద్రవపదార్థాలైన మజ్జిగ, కొబ్బరిబొండాలు, గ్లూకోజ్ వాటర్, మంచినీరు, ఒఆర్‌ఎస్ వాటర్ తీసుకోవాలని, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని, తలకి టోపి, తలాపాగా, గొడుగు, కళ్లద్దాలు ధరించాలని చెప్పారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రోజా, శశాంక్, బాలకృష్ణ, ఎపిహెచ్ ఇఒ కేత సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, హెల్త్ సూపర్వైజర్స్ మార్తమ్మ, హైమావతి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు రైతులకు విశిష్ట సంఖ్య నమోదు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాయితీ పథకాలు అమలు చేయడానికి ఫార్మర్ రిజిస్ట్రర్ పోర్టల్ ద్వారా భూమి కలిగిన ప్రతి రైతుకు యూనిక్ ఐడి 11 అంకెల సంఖ్య వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేయబడుతుందని నూజివీడు మండల వ్యవసాయ అధికారిణి ఎ.చాముండేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీ నూజివీడు తహశీల్దార్ కార్యాలయంలో నూజివీడు రెవెన్యూ పరిధిలోని భూ యజమానులకు, వ్యవసాయ సిబ్బంది ద్వారా ఈ సంఖ్య ఇవ్వబడుతుంది. నూజివీడు రెవెన్యూ పరిధిలో భూమి ఉన్న ప్రతి రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకొని వ్యవసాయ రంగంలో ప్రభుత్వం ద్వారా ఇచ్చే రాయితీలు, విత్తనాలు, ఎరువులు, పిఎం కిసాన్ పథకం, అన్నదాత సుఖీభవ పథకం, మద్దతు ధర, ట్రాక్టర్, కోత యంత్రాలు, పామాయిల్ మొక్కలు, డ్రిప్ రాయితీలను పొందవచ్చని నూజివీడు మండల వ్యవసాయ అధికారిణి ఎ.చాముండేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు.


రేషన్ వాహనంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్

రేషన్ దుకాణాల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రేషన్ షాప్ దుకాణాలను పరిశీలించినట్లు తహశీల్దార్ కె.రాజకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సర్వే నిర్వహించాలని, సర్వే చేసే అధికారులకు సూచించారు. అనంతరం ఆయన గ్రామంలోని 33, 8 రేషన్ షాపులను పరిశీలించి, ఇంటింటికి వెళ్లే రేషన్ వాహనాన్ని పరిశీలించారు. ఆ వాహనంలో ఉన్న స్టాక్ రిజిస్టర్లను, స్టాకు రిపోర్ట్ పరిశీలించి, ఎలాంటి అవకతవకలు లేకుండా నిర్వహించాలని సూచించారు.

ప్రథమ సంవత్సర ఇంగ్లీష్ పరీక్షకు 12 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక అల్లూరి సీతారామరాజు జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర ఇంగ్లీష్ - 1 పరీక్షకు 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ నంబూరి గోపాల కృష్ణంరాజు తెలిపారు. రెండు ప్రభుత్వ, ఒక ప్రయివేటు కళాశాల నుంచి మొత్తం 210 మంది విద్యార్థులు ఇంగ్లీష్ పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 198 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సర ఇంగ్లీష్ పరీక్షకు 94 శాతం విద్యార్థులు పరీక్షలు రాసినట్లు నంబూరి గోపాల కృష్ణంరాజు తెలిపారు.

రాజశేఖరం విజయంపై హర్షం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి కూటమి బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించడం పట్ల ఏలూరు ఎంపి పుట్టా మహేష్ కుమార్ ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేశారు. ఎంఎల్‌సిలుగా విజయం సాధించి, చట్టసభలో అడుగుపెడుతున్న వీరికి ఎంపి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

చింతలపూడి : ఎంఎల్‌సి ఎన్నికల్లో రాజశేఖరం విజయాన్ని కాంక్షిస్తూ సుదూర ప్రాంతాల నుంచి సమయాన్ని వెచ్చించి ఓటు వేసిన గ్రాడ్యుయేట్స్, ఉద్యోగ, ఉపాధ్యాయులకు చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రకటన విడుదల చేశారు.

టి.నరసాపురం : ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సిగా పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించిన సందర్భంగా మండలంలోని తిరుమలదేవిపేట టిడిపి నాయకులు తోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం కేకు కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో మొదటిసారిగా ఎంఎల్‌సిగా టిడిపి జెండా ఎగరవేసిన పేరాబత్తుల రాజశేఖరంకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తరాంధ్ర ఎంఎల్‌సి శ్రీనివాసులుకు సన్మానం

ప్రజాశక్తి - చింతలపూడి

ఉత్తరాంధ్ర టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపొందిన డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడుని పిఆర్‌టియు నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి సుబ్బారావు నేతృత్వంలో ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ బాధ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల కోసం కృషి చేస్తానన్నారు. రాష్ట్ర, కౌన్సిల్ సభ్యులు అప్పిరెడ్డి రాము, జిల్లా నాయకులు మిద్దె దయాకర్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కులాంతర వివాహం చేసుకున్నారని..

యువకునిపై యువతి తల్లిదండ్రులు దాడి

ఏలూరు సిటీ : కులాంతర వివాహం చేసుకున్నాడని యువకుడిపై యువతి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దాడి చేశారు. యువకుడు తీవ్ర గాయాలతో ఏలూరులోని గవర్నమెంట్ హాస్పిటల్‌లో వైద్యం పొందుతున్నాడు. ఏలూరులోని దొండపాడు గ్రామానికి చెందిన దాడిశెట్టి మణికంఠ, గుంటూరు జిల్లా, అమరావతి వద్ద గల బోలెపాడు గ్రామానికి చెందిన సంయుక్త ఫిబ్రవరి 17న ఏలూరులోని అంబేద్కర్ యువజన సంఘంలో పెళ్లి చేసుకున్నట్లు మణికంఠ తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం వారిరువురికి రెండు సంవత్సరాల నుంచి పరిచయం ఉందని, సంవత్సరం నుంచి హైదరాబాద్‌లోనే కలిసి ఉంటున్నామని తెలిపారు. ఈనెల 3వ తేదీన మణికంఠ తల్లిదండ్రులు ఒప్పుకోవడంతో ద్వారకా తిరుమలలో వివాహం చేసుకొని, రెండో తేదీన అన్నవరంలో సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకున్నామని తెలిపారు. అమ్మాయి తల్లిదండ్రులు వారి వివాహం ఇష్టం లేకపోవడంతో గత సోమవారం రాత్రి అమ్మాయి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఒక యాభై మంది వారి ఇంటి వద్దకు వచ్చి తన పై దాడి చేసి, వారి తల్లి దండ్రులను కొట్టి అమ్మాయిని బలవంతంగా ఎత్తుకుపోయినట్లు తెలిపారు. నిన్నటి నుంచి తన భార్య ఏమైందో ఆమె ఆచూకీ తనకు ఇవ్వడం లేదని వాపోతున్నారు. తన భార్యను తనకు అప్పగించాలని, తనకు న్యాయం చేయాలని కోరారు.

చికిత్స పొందుతున్న యువకుడు

నలుగురుపై బైండోవర్

ముసునూరు : మండలంలోని ముసునూరు గ్రామానికి చెందిన నలుగురిని 129 బిఎన్ఎస్ఎస్ యాక్ట్‌పై ముసునూరు తహశీల్దార్ కార్యాలయం వారి ఎదుట బైండోవర్ చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 అనే కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ టి.శ్రీలత, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ నాగ ప్రభు కుమార్, జిల్లా డిస్ట్రిక్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఆవులయ్య ఆదేశాల మేరకు మంగళవారం బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బైండోవర్ అయిన వారిని ముసునూరు తహశీల్దార్ వారు ఒక సంవత్సరం కాల పరిమితి ఉంటుందని, ఈ సంవత్సరంలో వీరు మరలా నేరాలకు పాల్పడితే, రూ.లక్ష జరిమానా, ప్రభుత్వం వారు అందించే సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని హెచ్చరించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అమరావతి నిర్మాణానికి రూ.100 కోట్ల విరాళాలు సేకరిస్తా

వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి

చిట్ చాట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

అమరావతి నిర్మాణానికి రూ.100 కోట్ల విరాళాలు సేకరిస్తానని, ఆంధ్రుల ఆడపడుచుగా, అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా, చంద్రబాబు స్ఫూర్తితో ముందుకు సాగుతున్నానని ముదినేపల్లికి చెందిన వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి అన్నారు. ఆనాడు అమరావతి నిర్మాణానికి చంద్రబాబు జోలి పట్టారు. నేడు అమరావతి పునర్నిర్మాణానికి తాను రూ.100 కోట్ల నిధులు సేకరిస్తానని వైష్ణవి వివరించారు. నామినేషన్ల నుంచి వారి నైపుణ్యం, అర్హత, స్థాయిల ఆధారంగా ప్రభుత్వ అనుమతి తీసుకుని బ్రాండ్ అంబాసిడర్లను సిఆర్ డిఏ ఎంపిక చేసి, ఒక ఏడాది కాలానికి వీరిని నియమించుకుని తదుపరి వారి పనితీరు ఆధారంగా మరికొంత కాలం బ్రాండ్ అంబాసిడర్‌గా పొడిగించే అవకాశం ఉందని అంబుల వైష్ణవి పేర్కొన్నారు. అమరావతి నిర్మాణానికి నావంతుగా విరాళాలు ఇవ్వడమే కాకుండా విరాళాలు సేకరిస్తానని ఆమె ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : అమరావతి బ్రాండ్ అంబాసిడర్లుగా ఎన్నికైన వీరి పనితీరు ఎలా ఉండాలని అనుకుంటున్నారు?

వైష్ణవి : అంతర్జాతీయ స్థాయి నగరంగా అమరావతిని ప్రమోట్ చేసేలా బ్రాండ్ అంబాసిడర్లు కార్యాచరణ చేపట్టాలి. ఎపి ఆర్థిక వృద్ధిలో అమరావతి ప్రాజెక్టు, స్మార్ట్ సిటీగా అమరావతి, దేశీయ, విదేశీ పెట్టుబడులు ఆకర్షించేలా బ్రాండ్ అంబాసిడర్లు చూడాలి. విజన్ అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయటంతో పాటు పెట్టుబడులు తీసుకువచ్చేలా బ్రాండ్ అంబాసిడర్లు పనిచేయాలి. దీనికోసం ఎక్కడికక్కడ సదస్సులు, సమావేశాలు అంతర్జాతీయ వేదికలపై కాన్ఫరెన్సులు, వర్క్‌షాపులు నిర్వహించాలి. తద్వారా భాగస్వాములను, పెట్టుబడిదారులను ఆకర్షించాలి.

ప్రశ్న : ఇంతవరకు ఎంత విరాళం అందించారు?

వైష్ణవి : భగవంతుని దయవల్ల రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పరిశ్రమలు రావాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తి అవ్వాలని, అమరావతి త్వరితగతిన నిర్మాణం రూపుదిద్దుకోవాలని ఎన్నో మార్లు ప్రకటించాను. బహిరంగంగాను ప్రకటించడమే కాకుండా నా వంతు సాయంగా ఎకరన్నర పొలం అమ్మి, నా తండ్రి డాక్టర్ మనోజ్ సహకారంతో ఇప్పటికే దాదాపు రూ.కోటి మేర విరాళంగా అందించా.

ప్రశ్న :మీ తండ్రి నుంచి ఏమి నేర్చుకున్నారు?

వైష్ణవి: నా తండ్రి డాక్టర్ మనోజ్ నుంచి సేవా దృక్పథం నేర్చుకున్నాను. పేదల పట్ల, ఎంతోమందికి పేదరికంతో ఉన్న, అనారోగ్యం వల్ల చనిపోయినా, ఫైర్ ఆక్సిడెంట్ జరిగిన వాళ్లకు ఎవరికైనా, ఏ అవసరం ఉన్నా తక్షణమే స్పందించి వారికి నా వంతు నగదు సహాయం చేసి నిత్యాసర సరుకులు అందిస్తున్నా. కష్టకాలంలో వారిని, వారి కుటుంబాన్ని ఓదార్చి, నేటికీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.

ప్రశ్న :మీరు విరాళాలు ఇవ్వడమే కాకుండా విరాళాలు సేకరిస్తారా?

వైష్ణవి : రాష్ట్ర ప్రజలందరి కోసం విద్యార్థి దశలోనే వినూత్నంగా ఆలోచించాను. నా వంతుగా విరాళాలు ఇవ్వడమే కాకుండా విరాళాలు సేకరిస్తానని చెప్పి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలవాలనేదే నా లక్ష్యం. కులమతాలకు అతీతంగా చిన్న, పెద్ద మధ్యతరగతి, సంపన్నులు, రైతులు, వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయవేత్తలు, ఎన్నారైలు, డాక్టర్లు, లాయర్లు, ఉద్యోగస్తులు, పొరుగు రాష్ట్రాల్లో ఉండేవారు ఇలా ప్రతి ఒక్కరినీ అమరావతి నిర్మాణంలో భాగస్వాములు కావాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనీయకథకు, విజనరీ మైండ్ కలిగిన ఏకైక నాయకుడు. వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఊపిరి పోసి, నా ఇటుక-నా అమరావతి అంటూ.. ప్రజలను జోలి పట్టి అభ్యర్థించిన చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ముందుకు వెళదాం. అందుకు రాష్ట్ర ప్రజలందరూ సహకరించాలని, ప్రతి ఒక్కరినీ పేరుపేరునా కోరుతున్నాను.

ప్రశ్న : రాష్ట్రం కోసం మీరు ఏమి చేయాలనుకుంటున్నారు?

వైష్ణవి : ఈ ఏడాదిలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రాజశ్యామల యాగం హోమం చేస్తాను. రాష్ట్ర ప్రజలందరూ ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నాను.

గ్రామప్రముఖులతో మాట్లాడుతున్న ఎస్ఐ

ఆలయం వద్ద ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని మూలలంక గ్రామంలో నేటి నుంచి జరగనున్న శ్రీపెద్దింట్లమ్మ వారి జాతర మహోత్సవాలను పురస్కరించుకొని ఆలయం వద్ద ఏర్పాట్లను ఎస్ఐ వి.వెంకటర్వరరావు పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పలు సూచనలు చేశారు. మూలలంక సర్పంచి విజయ బాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, భీమవరం పట్టణం డోర్ నెం. 15-13-2/3 కాపురస్తులు మాగాపు ప్రసాద్, S/o. మాగాపు వెంకటరాజు అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయింది. **పాస్‌పోర్ట్ నెం. M9807782.** ది. 1-03-2025 తేదీన భీమవరం పట్టణం నందు తాలూక ఆఫీస్ సెంటర్‌కు వెళ్ళుచుండగా నా ఫ్యాంట్ జేబు నందు గల నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మాగాపు ప్రసాద్
S/o. మాగాపు వెంకటరాజు
డోర్ నెం : 15-13-2/3,
భీమవరం పట్టణం,
భీమవరం మండలం, ప.గో.జిల్లా
సెల్: 99896 67799

ఏలూరు సిటీ : మహిళలకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ

మహిళలందరూ ఆరోగ్యంగా ఉండాలి

ఏలూరు సిడిపిఒ విజయలక్ష్మి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మహిళలందరూ పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సిడిపిఒ విజయలక్ష్మి సూచించారు. ఏలూరులోని పుష్ప లీలానగర్ అంగన్వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హ్యాపీ అండ్ హెల్తీ ఉమెన్ ప్రోగ్రాంను సిడిపిఒ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలందరూ కూడా పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా పిల్లలకు కూడా పౌష్టికాహారం ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మిల్లెట్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మంగ, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మండవల్లిలో..

మండవల్లి : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అవగాహన కలిగి బాల్యవివాహాల నియంత్రణకు కృషిచేయాలని ఐసిడిఎస్ సూపర్వైజర్లు నాగలక్ష్మి, ప్రసన్నలు కోరారు. కైకలూరు ప్రాజెక్ట్ సిడిపిఒ దీప్తి ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండవల్లి, భైరవపట్నం, చావలిపాడు, లోకుమూడి, కొవ్వాడ లంక, మణుగూరు పాఠశాలలో కిశోర బాలికలకు భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల చిన్నారుల బంగారు భవిష్యత్తు నాశనం అయిపోతుందన్నారు. అభం శుభం తెలియని తనం నుంచి ఎన్నో ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేయడానికి ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమడోలులో..

భీమడోలు : మహిళలు, బాలికలు అందరికీ హక్కులు, సమానత్వం సాధికారత లక్ష్యంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సేవలను వినియోగించుకోవాలని ఐసిడిఎస్, భీమడోలు ప్రాజెక్టు పరిధిలోని పూళ్ల సెక్టార్ పర్యవేక్షకులు నూర్జహాన్ బేగం కోరారు. సెక్టార్ పరిధిలోని వివిధ గ్రామాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా కురెళ్లగూడెం గ్రామంలో మంగళవారం హెల్తీ ఉమెన్, హ్యాపీ ఉమెన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం చిరుధాన్యాల వాడకం, పౌష్టికాహార వినియోగం, సామాజిక రుగ్మతగా మారిన బాల్యవివాహాల నిరోధం అనే అంశాలపై అవగాహనా కార్యక్రమాన్ని పర్యవేక్షకులు నిర్వహించారు. పురవీధులలో ర్యాలీ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, గర్భిణులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ముసునూరు

ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల పాఠశాల ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని ముసునూరు గురుకుల బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ప్రవీణ అన్నారు. మంగళవారం గురుకుల బాలికల పాఠశాలలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఐదు, ఆరు, ఏడు, ఎనిమిదవ తరగతులలో ప్రవేశాలకు నేటి నుంచి ఈనెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పత్రికా ముఖంగా తెలియజేశారు. ఎవరికైనా ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే పాఠశాల పని దినాల్లో సంప్రదించ వచ్చునని ఆమె తెలియజేశారు.

మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలను కొనుగోలు చేయాలి

6న కలెక్టరేట్ వద్ద ధర్నా

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలను కంపెనీలు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏలూరు అన్నే భవనంలో కోకో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు కోకో రైతుల సమస్యలపై చలో కలెక్టరేట్ ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. అన్ని గ్రామాల నుంచి కోకో రైతులు ఏలూరు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో కిలో కోకో గింజలకు రూ.900 ధర ఉన్నా ఆ ప్రకారం రైతుల నుంచి కోకో గింజలు కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం కిలో గింజలకు రూ.500 నుంచి రూ.650 మాత్రమే ధర ఇవ్వడం వల్ల కోకో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలు కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కోకో రైతు సంఘం నాయకులు పానుగంటి అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

ఎయిడ్స్ మృతుల పిల్లలను ఆదరించాలి

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధికి గురై మరణించిన వారి పిల్లలు అనాథలుగా మిగిలిపోతున్నారని చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో సమాజంలో ఎదుర్కొంటున్న పలు అంశాలపై ఆయన స్పందించారు. రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ చికిత్సతో పాటు క్షయ వ్యాధి నివారణకు ఏవిధమైన చర్యలు చేపడుతున్నారు? సమాజంలో కళంకంగా ఉన్న ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులను ఆదరించడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఏమిటి? అని అడిగారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల్లో సహజంగా లోపించే విటమిన్ డి పూరించడానికి ప్రభుత్వం చేపట్టే చర్యలు వివరించాలని కోరారు. ఈనాడు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధికి గురై మరణించిన వారి పిల్లలు అనాథలుగా మిగిలిపోతున్నారని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వపరంగా తీసుకున్న చర్యలు ఏమైనా ఉన్నాయా? ఉంటే తెలియజేయాలని కోరారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజలకు తెలియజేయాలని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రిని కోరారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - చింతలపూడి

హరిజన పేటలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని అధికారులు పట్టించుకొని చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. మండలంలోని ప్రగడవరం పంచాయతీ హరిజనపేటలో డ్రెయినేజీ పరిస్థితి దారుణంగా ఉందని, దుర్గంధం వెదజల్లుతూ, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని, అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీలకు నిధులు మంజూరు చేసినా.. అధికారులు ఖర్చు పెట్టటం లేదని వాపోతున్నారు. జిల్లా అధికారులు దృష్టి సారించి హరిజన పేటలోని సమస్యలను పరిష్కరించాలని, డ్రెయినేజీ పూడిక తొలగించి, పారిశుధ్యం మెరుగుకు కృషిచేయాలని హరిజన పేట ప్రజలు కోరుకుంటున్నారు.

రోడ్డుపైకి చేరిన మురుగు

ఎలక్ట్రిక్ వెహికల్స్ కొనసాగిన వర్క్‌షాప్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూర్య త్రినాథ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జియుకెటి) నూజివీడు క్యాంపస్‌లో 'టెక్‌జైట్' 25 టెక్నికల్ ఫెస్టివల్‌లో భాగంగా క్రియేటివ్ డిజైన్ మాస్టరీ, ఎలక్ట్రిక్ వెహికల్ వర్క్‌షాపులు నిర్వహించారు. క్రియేటివ్ డిజైన్ మాస్టరీ వర్క్‌షాప్ ముఖ్యంగా పియుసి విద్యార్థులకు ఫొటోషాప్, క్యాన్వాపై అవగాహన పెంచి, డిజైనింగ్‌లో ఉన్న ఉద్యోగ అవకాశాలను తెలియజేయడమే లక్ష్యంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూర్య త్రినాథ్ చోడిశెట్టి సీనియర్ ప్రొడక్ట్, గ్రాఫిక్ డిజైనర్, ఎస్ఎస్ఐటీ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయన డిజైన్ రంగంలో ఉన్న అవకాశాలు, మెరుగైన డిజైనింగ్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవడం, మార్కెట్‌లో ఉన్న డిమాండ్ గురించి వివరణ ఇచ్చారు. ఇఇఇ విభాగం విద్యార్థుల కోసం 'ఎలక్ట్రిక్ వెహికల్' అసెంబ్లింగ్, డిసెంబ్లింగ్‌పై రెండో రోజు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో విద్యార్థులు వాహన భాగాలను విడదీయడం, మళ్లీ అసెంబ్లీ చేయడం ప్రాక్టికల్‌గా నేర్చుకున్నారు. బ్యాటరీ కనెక్టివిటీ, మోటార్ కంట్రోల్, బ్రేకింగ్, పవర్ డిస్ట్రిబ్యూషన్ అంశాలపై ట్రైనింగ్ అందించారు. చివరిగా విద్యార్థులు టెస్ట్ డ్రైవ్ చేసి వాహన వ్యవస్థను అనుభవపూర్వకంగా అర్థం చేసుకున్నారు. ఈ వర్క్‌షాప్ విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం కల్పించి, కెరీర్ అవకాశాలను అన్వేషించేందుకు సహాయపడింది. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, RAMANATHI VENKATARATNAM S/O VENKATESWARARAO, age 41 years Passport No-L7228380, Door No. 7-131, Kobbarithotapalem, Siddhantam, Penugonda Mandalam, West Godavari District, AP hereby solemnly affirm state on oath as followed I have changed my name from RAMNATI VENKATARATNAM (Old Name) RAMANATHI VENKATARATNAM (New Name) hence forth I am being called RAMANATHI VENKATARATNAM, S/O VENKATESWARARAO for all purpose. my father has changed his name from RAMNATI VENKATESWARARAO (Old Name) to RAMANATHI VENKATESWARARAO (New Name). Mother has changed his name from RAMNATI NAGAMANI (Old Name) to RAMANATHI NAGAMANI (New Name) for all purpose.

సారా రహిత రాష్ట్రం అందరి లక్ష్యం కావాలి

జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ పాండురంగారావు

నూజివీడు టౌన్ : సారా రహిత రాష్ట్రం అందరి లక్ష్యం కావాలని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ జి.పాండురంగారావు అన్నారు. నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చినట్లు తెలిపారు. వివిధ రికార్డులను పరిశీలించి నవోదయం 2.0లోని ఎ, బి, సి కేటగిరీల్లో కలవారిని బైండోవర్ చేయాలని ఆదేశించారు. అందుకోసం ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేయాలన్నారు. సారా తయారీ కేంద్రాలు, సరఫరా, విక్రయాలపై డేగకన్ను వేయాలన్నారు. నాటుసారా తయారీ, గంజాయి సరఫరాలపై నిఘా పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ప్రొహిషన్ ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య, పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, భీమవరం పట్టణం డోర్ నెం. 15-13-2/3 కాపురస్తులు మాగాపు సత్యవాణి, W/o. మాగాపు ప్రసాద్ అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయింది. **పాస్‌పోర్ట్ నెం. M9807314.** ది. 1-03-2025 తేదీన భీమవరం పట్టణం నందు తాలూక ఆఫీస్ సెంటర్‌కు నా భర్తతో వెళ్ళుచుండగా నా భర్త గారి ఫ్యాంట్ జేబు నందు గల నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మాగాపు సత్యవతి
W/o. మాగాపు ప్రసాద్
డోర్ నెం : 15-13-2/3,
భీమవరం పట్టణం,
భీమవరం మండలం, ప.గో.జిల్లా
సెల్: 99896 67799

ప్రకటన

మహారాజశ్రీ ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కం ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం, ప॥గో॥జిల్లా

ఓ.ఎస్.నెం. 264/2023

బిట్వీన్ :
శ్రీ కొల్లబత్తుల వెంకట కృష్ణ & 2 అదర్స్ ...వాది
మరియు
కొల్లబత్తుల నర్సింహ స్వామి & 2 అదర్స్ ...ప్రతివాదులు

సమన్స్ టు :
D-2: కొల్లబత్తుల రాంబాబు S/o. లేట్ ఆనందరావు, పురుషుడు, వయస్సు: 50 సం.రం.లు, ప్రైవేటు జాబ్, పనసదీవి గ్రామం, నరసాపురం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

మీ పై కొల్లబత్తుల వెంకట కృష్ణ & 2 అదర్స్ అను వార్లు ఫైల్ చేసిన దావా లో మీరు రెండవ ప్రతివాది అయియున్నారు. మహారాజశ్రీ ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కం ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం, ప॥గో॥జిల్లా వారు మీకు ఎన్నిసార్లు రిజిష్టర్ పోస్ట్ ద్వారాను, మరియు శ్రీ కోర్టు వారి ద్వారాను నోటీసులు పంపించినప్పటికి దావా సమన్లు మీరు తీసుకోకుండా కాలయాపన చేస్తునందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 11-04-2025 సం. తేదీన ఉదయం 10:30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి, తీర్మానించబడునని మీకు తెలియజేయుచున్నాము.

N. మోహన్‌లాల్
జి.పి. సుదర్శనరావు
పిటీషనర్స్ తరపున అడ్వకేట్స్,
నరసాపురం

నరసాపురం
ది. 04-03-25,
సెల్: 92939 47199
సెల్: 99856 49898

ప్రకటన

మహారాజశ్రీ ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కం ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం, ప॥గో॥జిల్లా

ఐ.ఏ.నెం. 685/2023 ఇన్
ఓ.ఎస్.నెం. 264/2023

బిట్వీన్ :
శ్రీ కొల్లబత్తుల వెంకట కృష్ణ & 2 అదర్స్ ...పిటీషనర్స్
మరియు
కొల్లబత్తుల నర్సింహ స్వామి & 2 అదర్స్ ...రెస్పాండెంట్స్

సమన్స్ టు :
R-2: కొల్లబత్తుల రాంబాబు S/o. లేట్ ఆనందరావు, పురుషుడు, వయస్సు: 50 సం.రం.లు, ప్రైవేటు జాబ్, పనసదీవి గ్రామం, నరసాపురం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

మీ పై కొల్లబత్తుల వెంకట కృష్ణ & 2 అదర్స్ అను వార్లు ఫైల్ చేసిన పిటీషన్ లో మీరు రెండవ రెస్పాండెంట్ అయియున్నారు. మహారాజశ్రీ ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కం ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం, ప॥గో॥జిల్లా వారు మీకు ఎన్నిసార్లు రిజిష్టర్ పోస్ట్ ద్వారాను, మరియు శ్రీ కోర్టు వారి ద్వారాను నోటీసులు పంపించినప్పటికి పిటీషన్ సమన్లు మీరు తీసుకోకుండా కాలయాపన చేస్తునందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 11-04-2025 సం. తేదీన ఉదయం 10:30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు పిటీషన్ విచారించబడి, తీర్మానించబడునని మీకు తెలియజేయుచున్నాము.

N. మోహన్‌లాల్
జి.పి. సుదర్శనరావు
పిటీషనర్స్ తరపున అడ్వకేట్స్,
నరసాపురం

నరసాపురం
ది. 04-03-25,
సెల్: 92939 47199
సెల్: 99856 49898

గ్రామపంచాయతీ కార్యాలయము, తోటపల్లి

టెండరు ప్రకటన

తేది. 04-03-2025

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, తోటపల్లి గ్రామపంచాయతీలో కాంట్రాక్టు లేబరు పద్ధతిపై ఈ క్రింది పనులు నిర్వహించుటకు ది. 01-04-2025వ తేదీ నుండి ది. 31-03-2026 వరకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. ఈ టెండర్లు ది. 11-03-2025వ తేదీ ఉదయం గం. 11.30 ని॥లకు తోటపల్లి పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిచే గానీ లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు స్వీకరించబడి, అదేరోజు మధ్యాహ్నం గం. 12.30 ని॥లకు హాజరైన టెండర్లదారుల సమక్షంలో సీల్డు టెండర్లు తెరవబడును. ప్రభుత్వ నిబంధనలకు లోబడి టెండర్లు దాఖలు చేయవలెను. ఇతర వివరముల కొరకు కార్యాలయం పనిచేయు వేళలయందు పంచాయితీ కార్యదర్శిని అడిగి తెలుసుకొనగలరు.

వ.నెం.	పనిపేరు	సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు
1	పారిశుద్ధ్య పనుల నిర్వహణ	1	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-
2	మంచినీటి సరఫరా నిర్వహణ	2	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-
3	ఎలక్ట్రీషియన్	1	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-

నోట్: 1) గతంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2) పంచాయితీ నిధులు, నిల్వలను బట్టి పేమెంట్ చెల్లించబడును. 3) ఎలక్ట్రీషియన్ పని కొరకు దరఖాస్తు చేసుకొన్న వారు సంబంధిత ప్రావీణ్యతా ధ్రువీకరణ పత్రంను సమర్పించవలెను. 4) టెండర్లను స్వీకరించుటకు లేదా తిరస్కరించుటకు పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.

సం/- **బడుగు మమత**
గ్రామపంచాయితీ కార్యదర్శి, తోటపల్లి,
ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా.

సం/- **ఆరేపల్లి శ్రీపద్మ**
సర్పంచ్, తోటపల్లి గ్రామపంచాయితీ,
ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా.